

క్రీడాకారులకు స్వర్గధామం

జిల్లాలో స్టేడియంలు సహా ఇతర వసతులు అందుబాటులోకి రావడంతో క్రీడాకారుల శిక్షణకు మెరుగైన అవకాశాలు ఏర్పడ్డాయి. 8లో



బౌద్ధం మతం కాదు.. మార్గం

బౌద్ధం అంటే మతం కాదని అందరూ అనుసరించదగిన మార్గమని బౌద్ధ మహాసభ బాధ్యులు వెల్లడించారు. 10లో

గరిష్టం / కనిష్టం
36^{o} / 26^{o}

వాతావరణం

జిల్లాలోని పలుచోట్ల శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిలోనే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులు


కాసరగడ్డ దీప

ఖమ్మం లీగల్: ఖమ్మం ఒకటో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తిగా కాసరగడ్డ దీప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె కొత్తగూడెం ఒకటో అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తిగా పనిచేస్తూ ఖమ్మంకు బదిలీపై వచ్చారు. ఇక మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వినుకొండ మాధవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆమె నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తించారు. ఈమేరకు న్యాయమూర్తులను ఖమ్మం బార్ అసోసియేషన్ బాధ్యులు, న్యాయవాదులు, ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఖమ్మం చేరుకోనున్న ఆయన రంగనాయకులగుట్ట వద్ద మమత ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహించే హెల్త్ క్యాంపులో పాల్గొంటారు. ఆతర్వాత వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, సాయంత్రం 4 గంటలకు శ్రీనివాసనగర్‌లోని బృందావన్ గార్డెన్‌లో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తారు. అనంతరం ఆరు గంటలకు జెడ్పీ సెంటర్‌లో ప్రభుత్వ వైద్య కళాశాలలో జరుగుతున్న పనులను పరిశీలించనున్న మంత్రి, ఆతర్వాత సర్దార్ పటేల్ స్టేడియంలో టెన్నిస్ కోర్టులను ప్రారంభిస్తారు.

నేడు పొంగులేటి ఆధ్వర్యాన రైతు భరోసా ర్యాలీ

ఖమ్మంమయూరిసెంటర్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం చెల్లించాలనే తదితర డిమాండ్లతో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన శనివారం ఖమ్మంలో రైతు భరోసా ర్యాలీ నిర్వహించనున్నారు. పొంగులేటి క్యాంపు కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందని క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రైతులతో పాటు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నిరుద్యోగ నిరసన సభను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య, పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా ఈనెల 8వ తేదీన హైదరాబాద్ సరూర్‌నగర్‌లో జరిగే నిరుద్యోగ నిరసన ర్యాలీ, సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సంపెట అన్వేష్‌రెడ్డి కోరారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాగా, అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ నాయకులు అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు కలెక్టరేట్ వినతిపత్రం అందజేశారు. ఈసమావేశాల్లో కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు రాయల నాగేశ్వరరావు, పుచ్చకాయల వీరభద్రం, వడ్డె నారాయణరావు, వీరబాబు, రామారావు, చెన్నారావు పాల్గొన్నారు.

అటు కన్నీళ్లు.. ఇటు కొర్రీలు

మిల్లర్ల అభ్యంతరాలతో రైతుల ఇక్కట్లు

- అకాల వర్షాలతో కేంద్రాల్లోనే తడుస్తున్న ధాన్యం
- ఆ ధాన్యాన్నీ కొనుగోలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం
- మరోపక్క నాణ్యత లేదని తిప్పి పంపుతున్న మిల్లర్లు


మిల్లర్లు వెనక్కి పంపడంతో దాచాపురంలో భద్రపర్చిన ధాన్యం బస్తాలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వరి సాగు చేసిన రైతులకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాసి ఎలాగోలా కాంటా వేయిస్తే ఆతర్వాత నాణ్యత లేదని మిల్లర్లు తిప్పి పంపుతున్నారు. తద్వారా అకాల వర్షాలతో ధాన్యం తడిసిన నేపథ్యాన అమ్ముకోవడం రైతులకు తలకు మించిన భారమవుతోంది. తాజాగా వైరా మండలం గరికపాడు సొసైటీలో రైతులు అమ్మిన 734 బస్తాల ధాన్యాన్ని చింతకాని మండలం నేరడలోని మిల్లుకు తరలించగా.. వెనక్కు పంపించారు. దీంతో హమాలీల చార్జీలు నష్టపోయిన రైతులు మళ్లీ ఆరబెట్టుకోవడంలో నిమగ్నమయ్యారు.

అకాల వర్షాలతో..

యాసంగి సీజన్‌లో అకాల వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. తరచుగా వర్షాలు కురుస్తుండటంతో కోసిన, కోత దశలో ఉన్న పంటలు దెబ్బతింటున్నాయి. మార్చి మొదటి, చివరి వారాలతో పాటు ఏప్రిల్ చివరి వారంలో కురిసిన వర్షాలు ఈనెలలోనూ కురుస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో పొలాల్లో ఉన్న వరి నేలవాలగా, కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. ఈ ధాన్యాన్ని ఆరబెట్టుకునే క్రమాన కాంటా ఆలస్యమవుతుండడంతో రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. మిల్లులకు తరలించే వరకు రైతులదే బాధ్యత కావడంతో మరింత ఇబ్బంది ఎదురవుతోంది.

ప్రభుత్వం హామీ ఇచ్చినా..

ఇటీవల అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న నేపథ్యంలో ప్రభుత్వం రైతులకు అండగా ఉంటామని ప్రకటించింది. తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నం ఉంటోందని, బస్తాలు తడిచినా మిల్లర్లు నిరాకరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఫలితంగా ధాన్యాన్ని మళ్లీమళ్లీ ఆరబోట్టాల్సి వస్తోంది.

నిరాకరిస్తున్న మిల్లర్లు

కొనుగోలు కేంద్రాలకు తరలించిన తర్వాత, కాంటాలు పెట్టిన తర్వాత కూడా వర్షాలు పడుతుండడంతో మళ్లీమళ్లీ ఆరబెట్టాల్సి వస్తోంది. ఈక్రమంలో వ్యవసాయాధికారులు నిర్ధారించాక కూడా వర్షం పడినా రైతులే బాధ్యత వహించాల్సి వస్తోంది. ఈక్రమంలోనే వైరా మండలం గరికపాడు పీఏసీఎస్ పరిధిలో ఐదుగురు రైతుల నుంచి కొనుగోలు చేసిన 734బస్తాల ధాన్యాన్ని చింతకాని మండలం నేరడలోని మిల్లుకు తరలిస్తే బస్తాలు తడిచాయంటూ గురువారం సాయంత్రం వెనక్కి పంపారు. అలాగే నేలకొండపల్లి మండలం కొత్త కొత్తూరుకు చెందిన రావెల వెంకన్న ధాన్యాన్ని కూడా మిల్లర్లు దిగుమతి చేసుకోలేదు.

హమాలీల చార్జీలు డబుల్

జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 36,442 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఇంకా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు కనిపిస్తున్నాయి. మరోపక్క వర్షసూచనలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మిల్లులకు పంపిన ధాన్యం వెనక్కి వస్తుండడంతో ఇంకా ఎన్నాళ్లు వేచి ఉండాలో తెలియడంలేదు. కాగా, ఒక సారి కాంటా వేసినందున హమాలీలకు రైతులు క్వింటా ఒక్కంటికి రూ.60 చొప్పున చెల్లిస్తున్నారు. ఆతర్వాత మిల్లర్లు వెనక్కి పంపిస్తే ఆరబెట్టాక మళ్లీ కాంటా వేయిస్తే చార్జీలు రెండోసారి చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మద్దతు ధర మాటేమో కానీ రైతులకు వ్యయం రెట్టింపవుతోంది.



శ్రమదోపిడీ చేస్తున్నారు..



మిల్లర్లు రైతుల ఆరుగాలం శ్రమను దోపిడీ చేస్తున్నారు. క్వింటాకు ఏడు కిలోల చొప్పున తరుగు పేరుతో కట్ చేస్తూ నిండా ముంచుతున్నారు. ఇది సరేనని అనుకుంటే ధాన్యం తడిచాయని ధాన్యం బస్తాలను అన్‌లోడ్ చేయకుండా వెనక్కు పంపిస్తున్నారు. దీంతో నిండా మునగాల్సి వస్తోంది.

– ముక్కాల వెంకటకృష్ణారెడ్డి, రైతు, దాచాపురం

తడిసిన ధాన్యాన్నీ కొంటాం..



అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వ సూచనలతో కొనుగోలు చేస్తాం. ఈ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దని ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల నిర్వాహకులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. గరికపాడు సొసైటీ పరిధిలో జరిగిన ఘటనపై నిర్వాహకులతో మాట్లాడతాం.

– ఎస్.మధుసూదన్, అడిషనల్ కలెక్టర్

ఏ రోజుకారోజు ధాన్యం దిగుమతి

- రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్


మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఏరోజుకా రోజు మిల్లులకు తరలించి దిగుమతి చేసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మిల్లర్లు, పౌరసరఫరాలు, సహకార, ఐకేపీ, మార్కెటింగ్ తదితర అధికారులతో ఆయన ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 222 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా, 3,860 మంది రైతుల నుండి 36442.040 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఇందులో 213 మంది రైతులకు రూ.3,38,54,832 నగదు కూడా జమ అయిందన్నారు. కాగా, కొనుగోలు కేంద్రాల నుండి వచ్చే ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు దిగుమతి చేసుకోవాలని, తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని సూచించారు. ఇక కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, వాహనాలు సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. డీసీఎంఎస్, డీసీసీబీ చైర్మన్లు రాయల శేషగిరిరావు, కూరాకుల నాగభూషణం, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల్ల వెంకటేశ్వరరావు, అదనపు కలెక్టర్ ఎన్‌మధుసూదన్, వివిధ శాఖల అధికారులు రాజేందర్, సోములు, విద్యాచందన, నాగరాజు, విజయనిర్మల, టి.కిషన్‌రావు, విజయకుమారి, అనసూయతో పాటు రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మా రాజేశ్వరరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

జిల్లాలో లే ఔట్ రెగ్యులేషన్ స్కీం కింద అందిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ పాత అనధికార లే ఔట్ల విషయమై లేఔవుట్ రెగ్యులేషన్ స్కీం ప్రకారం చర్యలు తీసుకోవాలని, ప్లాట్ల వారీగా కాకుండా లే ఔట్ల వారీగా పరిష్కరించాలని తెలిపారు. ఒక్కో టీపీఓ రోజుకు వంద దరఖాస్తులు పరిశీలించాలని చెప్పారు.

తాగునీటి సమస్య రావొద్దు

వేసవిలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య రాకుండా ఏర్పాటుచేయాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ తాగునీటి ఇక్కట్లు ఎదురుకాకుండా ముందస్తు జాగ్రత్తచర్యలు చేపట్టాలని, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణంలో వేగం పెంచాలని, లీకేజీ తదితర మరమ్మతులు ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీసీపీ కె.వికాస్, డీటీసీపీ ప్రసాద్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్, మిషన్ భగీరథ ఈఈలు రంజిత్, కృష్ణాలాల్, పుష్పలత, వాణిశ్రీ, మధిర, సత్తుపల్లి, వైరా మున్సిపల్ కమిషనర్లు రమాదేవి, సుజాత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే...

కనులపండువగా శ్రీలక్ష్మీ నర్సింహస్వామి కల్యాణం

ఏన్కూరు: మండలంలోని గార్లఒడ్డులో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 6–30గంటలకు స్వామి కల్యాణాన్ని జరిపారు. కల్యాణోత్సవానికి తిలకించేందుకు వివిధ మండలాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకాగా, ఈఓ సూర్యప్రకాశరావు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.


స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆదివాసీ చట్టాలపై కేంద్రం దాడి

- మోదీకి ఇండియా అంటే అంబానీ, అదానీలే..
- నిధుల కోత పెట్టి గ్రామీణుల ఉపాధిపై దెబ్బకొట్టారు..
- ఆదివాసీ రాష్ట్రీయ్ మంచ్ అధ్యక్షురాలు బృందాకారత్
- బీజేపీని తెలంగాణలో అడుగు పెట్టనీయం : తమ్మినేని


ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు (ఇన్‌సెట్) బహిరంగ సభలో మాట్లాడుతున్న బృందాకారత్

భద్రాచలంటౌన్: ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కులు కల్పించే అటవీ హక్కుల చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని, ఆదివాసీ రక్షణ చట్టాలపై దాడి చేస్తోందని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ అధ్యక్షురాలు, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ విమర్శించారు. భద్రాచలం పట్టణంలో జరుగుతున్న తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర 3వ మహాసభలకు శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ నుంచి కళాశాల మైదానం వరకు ఆదివాసీలు సంప్రదాయ నృత్యాలతో నిర్వహించిన భారీ ర్యాలీ నిర్వహించగా, ఆమె పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ప్రధానమంత్రి ఇకనైనా మన్‌కీ బాత్ వదిలి ఆదివాసీల బాధలు వినాలని సూచించారు.

బ్రిటీష్ పాలకులకు లొంగిపోయిన ఆర్ఎస్ఎస్

ఆనాటి బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఆదివాసీలు పోరాటాలు చేసి ప్రాణత్యాగాలు చేస్తుంటే.. బీజేపీ అనుబంధ ఆర్ఎస్ఎస్ బ్రిటీష్ పాలకులకు లొంగిపోయిందని ఆరోపించారు. ఇప్పటికీ రైల్వేలో సుమారు రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో 30 శాతం కోత విధించి గ్రామీణ ప్రజల ఉపాధి అవకాశాలపై బీజేపీ ప్రభుత్వం దెబ్బకొట్టిందని ఆరోపించారు. మోదీ దృష్టిలో ఇండియా అంటే అంబానీ, అదానీ మాత్రమేనని అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్ఎస్‌కు తాము మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పోడు సాగుదారులపై దాడులు ఆపి హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల అభివృద్ధికి నిధులు కేటాయించి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

బీజేపీని అడ్డుకునేందుకే బీఆర్ఎస్‌తో పొత్తు

తెలంగాణా రాష్ట్రంలో బీజేపీ అడుగు పెట్టకుండా అడ్డుకునేందుకే బీఆర్ఎస్‌తో తమ పార్టీ పొత్తు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. అదే సమయంలో ఆదివాసీల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ప్రభుత్వంతో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సీపీఎం పోరాట ఫలితంగానే బీఆర్ఎస్ ప్రభుత్వం పోడు భూములకు హక్కు పత్రాలు అందజేస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. హామీని నిలబెట్టుకోకపోతే భద్రాచలం నుంచి హైదరాబాద్ సచివాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామని హెచ్చరించారు. వలస ఆదివాసీల హక్కుల కోసం సీపీఎం ఎల్లప్పుడూ పోరాడుతుందని అన్నారు. భద్రాచలం అభివృద్ధి సీపీఎంతోనే సాధ్యమని, సంక్షేమం, ప్రశాంత వాతావరణం కావాలంటే సీపీఎంను గెలిపించాలని కోరారు. ఈ బహిరంగ సభలో టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబూరావు, టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి తోడసం భీంరావు, పోతినేని సుదర్శన్‌రావు, పి.సోమయ్య, బండారు రవికుమార్, పాయం రవివర్మ, సరియం కోటేశ్వరరావు, అన్నవరపు కనకయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, కారం పుల్లయ్య, దుగ్గి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’కు ఏర్పాట్లు పూర్తి

- రేపు జిల్లాలోని ఐదు కేంద్రాల్లో నిర్వహణ
- అర గంట ముందు వరకే విద్యార్థులకు అనుమతి

ఖమ్మం సహకారనగర్: దేశవ్యాప్తంగా వైద్యకళాశాలల్లో 2023–24వ విద్యాసంవత్సరానికి ప్రవేశాలు కల్పించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యాన నిర్వహిస్తున్న నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రెన్స్ టెస్టు) ఆదివారం జరగనుంది. ఈమేరకు జిల్లాలోని ఐదు కేంద్రాల్లో యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేసింది.

ఐదు కేంద్రాలు.. 3,118మంది

నీట్ నిర్వహణకు జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా, 3,118మంది విద్యార్థులు హాజరయ్యారు. ఖమ్మం బల్లేపల్లి సమీపంలోని బ్లూమింగ్ స్కూల్‌లో 432మంది, రఘునాథపాలెం(కోయచలక స్టేజీ వద్ద) ఎస్ఈఎస్ వీవీ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో 432, నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాలలో 360, మాక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్‌లో 216, హార్వెస్ట్ స్కూల్‌లో 1,678మంది విద్యార్థులను కేటాయించారు. పరీక్ష మధ్యాహ్నం రెండు నుంచి 5–20గంటల వరకు నిర్వహించనుండగా విద్యార్థులను 11గంటల నుంచి మధ్యాహ్నం 1–30గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

విద్యార్థులకు సూచనలు

- పరీక్ష కేంద్రాల గేట్లను మధ్యాహ్నం 1–30గంటలకు మూసివేసి, ఆతర్వాత వచ్చిన వారిని అనుమతించరు.
- ప్రతీ విద్యార్థి ప్రభుత్వం జారీ చేసిన ఒరిజినల్ గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది.
- ఎవరికి వారే వాటర్ బాటిల్ తీసుకెళ్లాలి.
- ఎన్‌టీఏ జారీ చేసిన అడ్మిట్‌కార్డుతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలి
- అడ్మిట్‌కార్డుతో పాటు డౌన్‌లోడ్ చేసుకున్న ప్రొఫార్మాపై పాస్‌పోర్టు సైజ్ కలర్‌ఫొటో అతికించుకుని హాజరుకావాల్సి ఉంటుంది.
- కాళ్లకు బూట్లు వేసుకుంటే అనుమతించరు. కేవలం స్లిప్పర్లు మాత్రమే వేసుకురావాలి.
- పరీక్ష నిర్వాహకులే విద్యార్థులకు పెన్నులు, మాస్కులు ఇస్తారు.

పకడ్బందీగా పరీక్ష నిర్వహిస్తాం...



నీట్ పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. విద్యార్థులను ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1–30గంటల్లోపే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తాం. ప్రతీ విద్యార్థి తమకు కేటాయించిన సమయం ప్రకారం చేరుకోవాలి. ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలి.

– ఆర్.పార్వతీరెడ్డి, పరీక్షల సిటీ కోఆర్డినేటర్

ఉన్నత పాఠశాలల్లో ‘లిప్’

- రానున్న విద్యాసంవత్సరం నుంచి అమలు
- 6నుంచి 9వ తరగతుల విద్యార్థులకు ఉపయోగం
- ఇప్పటికే హైదరాబాద్‌లో డీఆర్పీలకు శిక్షణ


చదువులో వెనుకబాటు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రప్రభుత్వం ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తోంది. కోవిడ్ కారణంగా విద్యార్థుల ప్రమాణాలు తగ్గిన క్రమాన ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు తొలిమెట్టును ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారు. ఇక ఉన్నత పాఠశాలల విద్యార్థుల్లో సైతం సామర్థ్యాలను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈక్రమంలో రానున్న విద్యాసంవత్సరం నుంచి లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్) అమలుకు కసరత్తు చేస్తున్నారు. ఈకార్యక్రమ నిర్వహణపై త్వరలోనే ప్రభుత్వం విధివిధానాలను వెల్లడించనుంది.

జిల్లాలోని 21 మండలాల పరిధిలో 456 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 29,443మంది విద్యార్థులు 6నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. కరోనా సమయాన విద్యాబోధన సక్రమంగా సాగక వీరందరూ ఇబ్బంది పడ్డారు. ఈక్రమంలో తాజాగా ముగిసిన విద్యాసంవత్సరం(2022–23) ఆరంభాన విద్యార్థులు బాగా వెనకబడ్డారని విద్యాశాఖ గుర్తించినట్లు తెలిసింది. దీంతో ఉన్నత తరగతుల విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు ‘లిప్’ ప్రవేశపెడుతున్నట్లు విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

తొలిమెట్టు సక్సెస్ కావడంతో..

ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు తొలిమెట్టు కార్యక్రమాన్ని 2022–23వ విద్యాసంవత్సరంలో అమలు చేయగా సత్ఫలితాలు వచ్చినట్లు విద్యాశాఖ గుర్తించినట్లు తెలిసింది. దీంతో ఉన్నత పాఠశాలల్లో సైతం సామర్థ్యాల పెంపునకు ఇంకో కార్యక్రమాన్ని చేపట్టాలనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో భాగంగానే రానున్న విద్యాసంవత్సరం నుంచి ‘లిప్’ను ప్రవేశపెడుతున్నట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే, తొలిమెట్టు మాదిరిగానే ప్రత్యేక తరగతులు, బోధన ఇవ్వడమే ఇంకా అదనంగా ఏమేం చర్యలు తీసుకుంటారనేది త్వరలోనే వెల్లడికానుంది.

వర్క్‌షాప్‌నకు ఉపాధ్యాయులు

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలల్లో లిప్ అమలు చేయాలని నిర్ణయించిన విద్యాశాఖ ఆ దిశగా కసరత్తు చేస్తోంది. స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ ట్రెనింగ్(ఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యాన తాజాగా రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటుచేశారు. ఇందులో జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు, తొలిమెట్టు అములులో పాల్గొన్న మధిర, కొణిజర్ల మండలాల నోడల్ అధికారులు ప్రభుదయాళ్, పుల్లయ్య హాజరయ్యారు. ఈమేరకు లిప్ అమలుకోసం ఎస్‌సీఈఆర్‌టీ బాధ్యులు చేసిన సూచనలను వీరు త్వరలోనే జిల్లా, మండల స్థాయిలో 6నుంచి 9వ తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు వివరించి శిక్షణ ఇవ్వనున్నారు.

విద్యార్థులకు ఎంతో మేలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమం మాదిరిగానే ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంచేందుకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్) చేపట్టాలని నిర్ణయించింది. రానున్న విద్యాసంవత్సరం నుంచే ఇది అమల్లోకి వస్తుంది. ఉన్నతాధికారుల మార్గదర్శకాల మేరకు విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగుపర్చేలా ప్రణాళికలు అమలుచేస్తాం.

– కేశవపట్నం రవికుమార్, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి

క్లుప్తంగా

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మం స్పోర్ట్స్: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న టేబుల్ టెన్నిస్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దుతున్న కోచ్ ఓలేటి సాంబమూర్తిని అభినందించారు. ఎంఈఓ శ్రీనివాసరావుతో పాటు పవన్‌కుమార్, డాక్టర్ శశికుమార్, చలపతి పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణపై టీఎస్ యూటీఎఫ్ హర్షం



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: కాంట్రాక్ట్ అధ్యాపకుల సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు వినోద్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణకు అధ్యాపకులు పాటుపడాలన్నారు. అలాగే, జాతీయ విద్యా విధానాన్ని తిప్పికొట్టాలని సూచించారు. అనంతరం కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడగా మురళి, నాగేశ్వరరావు, శ్రీకాంత్, పద్మ, తిరుపతి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో పరిశీలన



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీఓ విద్యాచందన

ముదిగొండ: మండలంలోని వల్లభి, గోకినేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం డీఆర్‌డీఓ విద్యాచందన పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీయడమే కాక, కొనుగోళ్లు, తరలింపుపై నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఏపీఎం చిన్నవెంకటేశ్వర్లు, సీసీలు రామారావు, అనురాధ పాల్గొన్నారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం, మక్కలు



మల్లవరంలో తడిసిన మొక్కజొన్న కంకులు

తల్లాడ: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో వరి ధాన్యం, మొక్కజొన్నలు తడిసాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఉంచిన వడ్లు తడవగా.. తరలింపులో జాప్యంతోనే ఇలా జరిగిందని రైతులు ఆరోపించారు. ఇక కొన్నిచోట్ల కోతకొచ్చిన వరి పైరుకు కూడా నేలవాలింది. మండలంలోని బిల్లుపాడు, తల్లాడ, అంజనాపురం, అన్నారుగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవగా, నారాయణపురం, మల్లవరంల్లో ఎండబెట్టిన మొక్కజొన్న కంకులు తడవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

హుండీలో నగదు చోరీ

పెనుబల్లి: మండలంలోని ఎడ్లబంజర్ శ్రీకోదండ రామాలయంలో చోరీ జరిగింది. ఈనెల 2న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో ప్రవేశించి హుండీ పగులగొట్టి సుమా రు రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఘటనపై దేవాలయం చైర్మన్ గోపిశెట్టి సుబ్బారావు శుక్రవారం చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,225	5,500
కందులు	7,800	7,800
మిర్చి	22,700	12,500
మిర్చి తాలు	12,000	8,000
పత్తి	7,400	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.14,205

క్రీడాకారులకు స్వర్గధామం

జిల్లాలో అందుబాటులో అన్ని సౌకర్యాలు

- నదుపాయాల కోసం క్రీడాశాఖ నుంచి రూ.16 కోట్ల కేటాయింపు
- వైరా, కల్లూరులో మొదలైన స్టేడియంలు
- మధిరలో చివరి దశకు చేరిన నిర్మాణం



ఖమ్మం స్టేడియంలోని స్కేటింగ్ రింక్‌లో ప్రాక్టీస్ చేస్తున్న చిన్నారులు

ఖమ్మం స్పోర్ట్స్: సంపూర్ణ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్న క్రీడాశాఖ లక్ష్యసాధనలోనూ దూకుడు ప్రదర్శిస్తోంది. గతంలో నామమాత్రంగానే నిధులు విడుదల చేసే అధికార యంత్రంగా గడిచిన ఆరేళ్లలో ఆ విధానాన్ని విడనాడింది. పెద్దమొత్తంలో నిధులు వస్తుండడంతో క్రీడాకారుల కోసం మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. జిల్లాలో మునుపెన్నడూ లేనంతగా క్రీడాభివృద్ధి కోసం దాదాపు రూ.16 కోట్లకు పైగా ఖర్చు చేయగా ఇందులో ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియం వసతుల కల్పన, కల్లూరు, వైరా మినీ స్టేడియం నిర్మాణం పూర్తయింది. ఇక మధిరలో రూ.2.65కోట్లతో నిర్మిస్తున్న మినీ స్టేడియం పనులు చివరి దశకు చేరాయి. అంతేకాక పాలేరులో రూ.2.65కోట్లతో మినీ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

జిల్లా కేంద్రంలో ఆటాడొచ్చు...

ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం, పెవిలియన్ గ్రౌండ్ ఇండోర్ స్టేడియంలో సౌకర్యాల కల్పనకు దాదాపు రూ.5కోట్లకు పైగా వెచ్చించడం విశేషం. పెవిలియన్ గ్రౌండ్‌లోని ఇండోర్ స్టేడియంను ఖమ్మం కార్పొరేషన్ నుంచి రూ.1.20కోట్లతో నిర్మించగా, మరో రూ.కోటితో స్టేడియంలో అదనపు గదుల నిర్మాణం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఇచ్చిన రూ.70 లక్షలతో జిమ్నాస్టిక్స్ హాల్, రూ.93లక్షలతో లాన్ టెన్నిస్ కోర్టు, రూ.27లక్షలతో వాలీబాల్ కోర్టు చుట్టు ఫెన్సింగ్ నిర్మించారు. అంతేకాక స్టేడియంలో ఆధునిక పరిజ్ఞానంతో రోలర్ స్కేటింగ్ రింక్ నిర్మాణానికి కలెక్టర్ బడ్జెట్ నుంచి రూ.26 లక్షలు వెచ్చించారు. మున్సిపల్ కార్పొరేషన్ నిధుల నుంచి రూ.20లక్షలను స్టేడియంలోని ఇండోర్ స్టేడియం మరమ్మతుల కోసం ఖర్చు చేశారు. అలాగే, చిన్నారుల కోసం ప్రత్యేకంగా స్విమ్మింగ్‌పూల్ నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.12 లక్షలు మంజూరు చేయగా.. ఆర్చరీ క్రీడాభివృద్ధికి కలెక్టర్ తన బడ్జెట్ నుంచి రూ.8.60లక్షలు, జిమ్నాజియం హాల్‌లో నిర్మాణాలకు ఇంకో రూ.8లక్షలు మంజూరు చేశారు. కాగా సర్దార్ పటేల్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ ఆడేందుకు ఆధునిక సింథటిక్ మ్యాట్స్‌ను రూ.6.94 లక్షల వ్యయంతో సిద్ధం చేశారు. వాకర్స్‌కు ప్రత్యేకంగా ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ఎంపీ ల్యాండ్స్ నుంచి రూ.4.92 లక్షలు విడుదలయ్యాయి. అలాగే, రూ.3లక్షలతో టర్ఫ్ వికెట్ నిర్మాణం పూర్తి చేశారు. ఇవేకాక వైరాలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కేటాయించిన రూ.1.63 కోట్లతో, కల్లూరులో రూ.3.40కోట్ల వ్యయంతో స్టేడియంలు అందుబాటులోకి తీసుకొచ్చారు. మరోపక్క మధిర నియోజకవర్గం కేంద్రంలో రూ.2.కోట్ల 65లక్షలతో నిర్మిస్తున్న మినీ స్టేడియం త్వరలో నిర్మాణం పూర్తి కానుంది.



కల్లూరులో ఇటీవల ప్రారంభించిన మినీ స్టేడియం



శనివారం ప్రారంభించనున్న టెన్నిస్ కోర్టులు

అన్నీ అందుబాటులో...

జిల్లాలో దాదాపు అన్ని నియోజకవర్గాల్లో మినీ స్టేడియంలు పూర్తి చేశారు. దీంతో ఔత్సాహిక, వర్ధమాన క్రీడాకారులు ప్రాక్టీస్ చేసేందుకు ఆటస్థలాలు అందుబాటులోకి వచ్చినట్లయింది. అటు మంత్రి పువ్వాడ అజయ్, ఇటు కలెక్టర్ గౌతమ్ చొరవతో నిధులు వరదలా వస్తుండగా, క్రీడా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టితో నిర్మాణాలు పూర్తిచేయిస్తున్నారు. ఇక క్రీడా సంఘాలు, పీఈటీలు, పీడీలు చొరవ చూపితే మరింత మంది మెరికల్లాంటి క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

కరెంట్‌తో చెలగాటం ఆడొద్దు..

విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్



సత్తుపల్లి : సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈ సురేందర్

సత్తుపల్లి/ఖమ్మం రూరల్/తల్లాడ: కంటికి కనిపించని కరెంట్‌తో చెలగాటం ఆడితే ప్రాణాలకే ముప్పు వస్తుందని ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ సురేందర్ అన్నారు. సత్తుపల్లి, ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురంతో పాటు తల్లాడలోని సబ్ డివిజనల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. వినియోగదారులెవరు కూడా సొంతంగా మరమ్మతు చేసేందుకు యత్నించొచ్చని, అవసరమైతే సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇక విద్యుత్ సిబ్బంది కూడా కుటుంబ సభ్యులను గుర్తుపెట్టుకొని విధులు నిర్వర్తించాలని తెలిపారు. మరమ్మతులు చేసే సమయాన అన్ని జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. అనంతరం విద్యుత్ భద్రత వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించడంతో పాటు ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశాల్లో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, విద్యుత్ శాఖ అధికారులు రాములు, ప్రసాద్‌బాబు, యాదగిరి, శరత్‌బాబు, సుజాత, అనిల్‌కుమార్, అంకారావు, భుజేంద్రకుమార్, గణేష్, తిరుపయ్య, నాగేశ్వరరావు రామకృష్ణ, క్రాంతిసింహ, రామారావు, అనంతప్రకాష్, రవి, ఖాదర్‌బాబా, రాజేష్, సుందర్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన ఆటోడ్రైవర్

- దారి మళ్లించి ఆభరణాలు చోరీ
- గంటలోపే నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాంబాయి

ఖమ్మంరూరల్: మండలంలోని గూడురుపాడు వద్ద మహిళపై దాడి చేసిన ఓ ఆటోడ్రైవర్ ఆమె మెడలోని బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. అయితే, నిందితుడిని పోలీసులు గంట వ్యవధిలోనే అదుపులోకి తీసుకుని సొత్తు రికవరీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై వెంకటకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతకాని మండలం పందిళ్లపల్లికి చెందిన అలవాల రాంబాయి ఖమ్మం రూరల్ మండలంలోని రాంలీల ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం జరిగిన బంధువు వివాహానికి హాజరయ్యేందుకు ఖమ్మం పాత బస్టాండ్‌లో బస్సు దిగి చిరునామా కోసం పెళ్లి కార్డును ఓ ఆటో డ్రైవర్‌కు చూపించింది. దీంతో తాను తీసుకెళ్తానని చెప్పిన డ్రైవర్ ఆటోను ఫంక్షన్ హాల్‌కు తీసుకెళ్లకుండా ఆరేకోడు మీదుగా గూడురుపాడు శివారు నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి ఆమె మెడలోని గొలుసు లాక్కునే యత్నం చేయగా రాంబాయి ఎదురుతిరిగింది. దీంతో రాయితో ఆమెపై దాడి చేస్తుండగా కేకలు వేయడంతో సమీపాన గొర్రెలు కాస్తున్న కుర్రి రామయ్య అక్కడకు వచ్చేలోగా బలవంతగా మెడలోని రెండు తులాల బంగారు తాడు, కాళ్లకు ఉన్న వెండి పట్టీలు లాక్కుని పరారయ్యాడు. దీంతో రామయ్య విషయాన్ని సర్పంచ్‌కు ఫోన్‌లో తెలపగా ఆయన ఇచ్చిన సమాచారంతో పోలీసులు చేరుకుని తీవ్రంగా గాయపడిన రాంబాయిని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చోరీ చేసిన ఆభరణాల విలువ రూ.70వేలు ఉంటుందని, బాధితురాలి కుమారుడి ఫిర్యాదుతో ఎస్ఐ వెంకటకృష్ణ, సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆతర్వాత తమకు అందిన సమాచారంతో తనగంపాడు గ్రామపంచాయతీ గుండాల తండాకు చెందిన గుగులోత్ మోహన్ అదుపులోకి తీసుకొని విచారించగా చోరీకి పాల్పడింది తానేనని అంగీకరించాడు. జల్సాలకు అలవాటు పడిన ఆయన సునాయాసంగా డబ్బు సంపాదించేందుకు ఒంటరిగా ఆటో ఎక్కిన రాంబాయి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నగలు లాక్కున్నట్లు వెల్లడించాడు. గంట వ్యవధిలోనే నిందితుడిని అరెస్ట్ చేసిన సీసీఎస్, ఖమ్మం రూరల్ ఏసీపీలు టి.రవి, బస్వారెడ్డి, సీఐలు ఎస్.మల్లయ్యస్వామి, రాజిరెడ్డి, ఎస్ఐ వెంకటకృష్ణ, సిబ్బందిని సీపీ అభినందించారు.

అప్పటిదాకా అక్క పెళ్లి వేడుకలో..

- ఫిట్స్‌తో స్పృహ కోల్పోయి తమ్ముడి మృతి
- పెళ్లింట్లో తీవ్ర విషాదం



తల్లిదండ్రులతో రేవంత్ దిగిన చివరి ఫొటో

టేకులపల్లి: బాజా భజంత్రీలు, బంధుమిత్రులతో సందడిగా ఉన్న పెళ్లి ఇంట్లో విషాదం నెలకొంది. కుమార్తెకు అప్పగింతలు చేసి అత్తారింటికి పంపిన రోజునే తల్లిదండ్రులు కుమారుడికి దహన సంస్కారాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన టేకులపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కార్పెంటర్ వెనగంటి రవీంద్రాచారి, భవాని దంపతులకు కుమార్తె నవ్యశ్రీ, కుమారుడు రేవంత్(22) ఉన్నారు. రేవంత్ నాలుగేళ్ల వయసు వరకు ఆరోగ్యంగానే ఉండగా ఆతర్వాత కాళ్లల్లో గుజ్జు కరిగి నడవలేని స్థితికి చేరడమే కాక మానసిక అనారోగ్యానికి గురయ్యాడు. వైద్యం చేయించినా నయం కాకపోవడంతో 22ఏళ్లు వచ్చినా చిన్న పిల్లల మనస్తత్వంతో ఉండేవాడు. అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుండేవి. కాగా డిగ్రీ పూర్తి చేసిన రవీంద్రాచారి కుమార్తె నవ్యశ్రీకి నల్లగొండకు చెందిన యువకుడితో వివాహం కుదిర్చారు. శుక్రవారం ఉదయం 10.53 గంటలకు ముహూర్తం కాగా, బంధుమిత్రులతో ఇల్లు కళకళలాడుతోంది. ఇంతలోనే 9 గంటలకు రేవంత్ ఫిట్స్‌తో పడిపోయాడు. దీంతో తల్లిదండ్రులను పెళ్లి వద్దే ఉంచి ఇతర కుటుంబ సభ్యులు సులానగర్ పీహెచ్‌సీకి, అక్కడి నుంచి కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోవడంతో మృతి చెందాడని ధ్రువీకరించారు. కాగా కుమారుడు చికిత్స పొందుతున్నాడని భావించి తల్లిదండ్రులు కూతురు వివాహం జరిపించి అప్పగింతలు చేసి అత్తారింటికి పంపారు. అనంతరం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకురావడంతో ఒక్కసారిగా గుండెలవిసేలా రోదించారు. కుమార్తెను కన్యాదానం చేసిన రోజునే కుమారుడికి అంత్యక్రియలు చేయాల్సి వచ్చిందని కన్నీరుమున్నీరుగా విలపించారు.

కర్షక సేవా సంఘాన్ని సందర్శించిన డీజీఎం



అధికారులకు స్వాగతం పలుకుతున్న చైర్మన్, ఎండీ

ఖమ్మంఅర్బన్: టేకులపల్లి ఆంధ్రాబ్యాంక్ కర్షక సేవా సహకార సంఘం కార్యాలయాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం హన్మంతరెడ్డి శుక్రవారం సందర్శించారు. బ్యాంక్ అనుబంధంగా కొనసాగుతున్న సంఘంలో లావాదేవీలు, రైతులకు అందించుతున్న సేవలు, రుణాలు, రికవరీపై చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డితో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు వెంకటేశ్వరరావు, ప్రకాశ్, అజయ్‌తో పాటు మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ కుమార్, వైస్ చైర్మన్ విజయలక్ష్మి, డైరెక్టర్లు నాగార్జునరావు, నాగమణి, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఆందోళన



భజరంగ్‌దళ్ కార్యకర్తలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఖమ్మం సహకారనగర్: అధికారంలోకి వస్తే భజరంగదళ్‌పై నిషేధం కాంగ్రెస్ నాయకులు ప్రకటించారని ఆరోపిస్తూ భజరంగ్‌దళ్ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయం ఎదుట శుక్రవారం హనుమాన్ చాలీసా పఠించేందుకు చేరుకున్నారు. ఇదేసమయాన కాంగ్రెస్ కార్యకర్తలు సైతం భజరంగ్‌దళ్ కార్యకర్తలపై దాడికి యత్నించగా ఉద్రిక్తత నెలకొంది. దీంతో అక్కడ బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్లకు తరలించారు. ఆతర్వాత కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు.

భజరంగ్‌దళ్‌ను రద్దు చేస్తామనడం గర్హనీయం

ఖమ్మం మామిళ్లగూడెం: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే భజరంగ్‌దళ్‌ను రద్దు చేస్తామనడం గర్హనీయమని బీజేపీ నాయకులు గెంటెల విద్యాసాగర్, డాక్టర్ శీలం పాపారావు పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపేందుకు యత్నించగా పోలీసులు టూటౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా విద్యాసాగర్, పాపారావు మాట్లాడగా నాయకులు నున్న రవికుమార్, మంద సరస్వతి, కిరణ్, వెంకట్, రుద్ర ప్రదీప్, దార్ల శంకర్, నకిరికంటి వీరభద్రం, జంపా, ఎస్.శ్రీనివాస్, ఆచంటి కోటేశ్వరావు, సుగుణ, మృత్యుంజయరావు, ప్రసాద్, జి.శ్రీనివాస్ నర్సింహారావు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడు మృతి

గుర్తించేలోగా కుళ్లిపోయిన మృతదేహం



వినయ్ (ఫైల్)

కారేపల్లి: మద్యం మత్తులో పడుకున్న ఓ యువకుడు మత్తులోనే మృతి చెందగా.. కుటుంబీకులు గుర్తించే సరికి మృతదేహం కుళ్లిపోయింది. ఈ ఘటన మండలంలోని గాదెపాడులో శుక్రవారం వెలుగు చూసింది. గాదెపాడుకు చెందిన నాగమణి తన కుమారుడు జక్కుల వినయ్(25)తో కలిసి జీవిస్తోంది. ఇటీవల మద్యానికి బానిసైన వినయ్ ఇంట్లో నుంచి వెళ్లి రెండు మూడు రోజులకోసారి వచ్చేవాడు. ఈక్రమంలోనే నాలుగు రోజుల క్రితం నాగమణి బంధువుల ఇంట్లో శుభకార్యం కోసం ఊరికి వెళ్లి రెండు రోజుల క్రితం వచ్చింది. ఇంటి వద్ద కుమారుడు వినయ్ లేకపోవటం, ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో ఆచూకీ కోసం యత్నిస్తోంది. ఇంతలోనే శుక్రవారం ఇంటి ప్రాంగణంలో దుర్వాసన వస్తుండటంతో డాబా పైకి వెళ్లి చూడగా దుప్పటి కప్పుకుని పడుకున్న స్థితిలో వినయ్ మృతి చెందగా, మృతదేహానికి పురుగులు పట్టి కుళ్లిపోతోంది. నాలుగు రోజుల క్రితమే అతిగా మద్యం సేవించి పడుకున్న ఆయన దాహంతో మృతి చెంది ఉంటాడని కుటుంబీకుల అనుమానం మేరకు కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్సై పి.రామారావు తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి...

పెనుబల్లి: కుమార్తెను చూద్దామని బయలుదేరిన వ్యక్తి వడదెబ్బ బారిన పడి మృతి చెందాడు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా చాట్రాయ్ మండలం నరసింహారావు పాలెంకు చెందిన పరిమి వెంకటేశ్వరరావు (48) పెనుబల్లి మండలం మండాలపాడలో ఉంటున్న కుమార్తె ఇంటి వద్దకు శుక్రవారం బయలుదేరాడు. మార్గమధ్యంలో వీఎం బంజర్ సెంటర్‌లో అస్వస్థతకు గురైన ఆయన అపస్మారక స్థితిలో పడిపోయి మృతి చెందాడు. దీంతో స్థానికులు ఆయన వద్ద ఉన్న వివరాల ఆధారంగా కుమార్తెకు సమాచారం ఇవ్వడంతో వెంకటేశ్వరరావు మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకెళ్లారు.

పొంగులేటి వెంటే ప్రయాణం

బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన పలువురు



పెనుబల్లి : టేకులపల్లిలో పెద్దమ్మతల్లికి పూజలు నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డి

మధిర: మధిర మండలం మాటూరుకు చెందిన యాభైకి పైగా కుటుంబాలు శుక్రవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా మాటూరు, మాటూరుపేట గ్రామాల్లో పర్యటించిన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసిన వారు తమ నిర్ణయాన్ని వెల్లడించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ పొంగులేటి వెంటే తమ ప్రయాణం ఉంటుందని తెలిపారు. నాయకులు డాక్టర్ కోట రాంబాబు, కాశీ కోటేశ్వరరావు, యన్నం కోటేశ్వరరావు, శీలం వీర వెంకటరెడ్డి, కపిలవాయి శ్రీనివాసరాజు, కొట్టే విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠాపన పూజల్లో..

పెనుబల్లి/ముదిగొండ/ఎర్రుపాలెం: పెనుబల్లి మండలం టేకులపల్లిలో పెద్దమ్మతల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టేకులపల్లి నాయకపోడు కుల దైవం పెద్దమ్మతల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనకు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరై పూజలు చేశారు. ఇక ముదిగొండ మండలం న్యూ లక్ష్మీపురం, ఎర్రుపాలెం మండలం అయ్యవారిగూడెం గ్రామాల్లో జరిగిన శుభకాకార్యాలకు కూడా పొంగులేటి హాజరయ్యారు.

బీజేపీ మతతత్వ పార్టీ, కాంగ్రెస్ మూలిగే నక్క

వైరా ఎమ్మెల్యే రాములునాయక్



చెక్కులు పంపిణీ చేస్తున్న వైరా ఎమ్మెల్యే రాములునాయక్

వైరా: బీజేపీ మతతత్వ అజెండాతో ప్రజలను వర్గాలుగా విభజించి పబ్బం గడుపుకునే యత్నం చేస్తుండగా, కాంగ్రెస్ మూలిగే ముసలి నక్క వంటిదని వైరా ఎమ్మెల్యే రాములునాయక్ పేర్కొన్నారు. అసమ్మతి నేతలకు వల వేస్తున్న బీజేపీతో పాటు కాంగ్రెస్ వలలో బీఆర్ఎస్ శ్రేణులు చిక్కుకోవద్దని సూచించారు. వైరాలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశాక మాట్లాడారు. మోదీ ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలతో తెలంగాణపై కక్షసాధింపు చర్యలు పాల్పడుతూనే అసమ్మతి నేతలకు ధనం, పదవులు ఎర జూపి వల వేస్తోందని విమర్శించారు. అయితే, ధన రాజకీయాలు ఎక్కువ కాలం సాగవన్నారు. కాగా, తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వాటి లబ్ధిదారులే సీఎం కేసీఆర్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేస్తామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైరా మున్సిపాలిటీ, మండల పరిధిలోని 29 మందికి, ఏన్కూరు మండలానికి 38 మంది షాదీముబారక్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులతో పాటు పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. వైరా, ఏన్కూరు తహసీల్దార్లు ఎస్.అరుణ, షేక్ ఖాసీం, ఎంపీపీ వేల్పుల పావని, జెడ్పీటీసీ ఎస్.కనకదుర్గ, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, మార్కెట్ చైర్మన్ బీడీకే.రత్నంతో పాటు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, కృష్ణార్జునరావు, లాల్‌మియా, మద్దెల రవి, బానోత్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మార్క్సిజంతోనే సమస్యలకు పరిష్కారం



సెమినార్‌లో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రపంచ గతిని మార్చిన మహోన్నత వ్యక్తి కారల్ మార్క్స్ చూపిన మార్గం అనుసరణీయమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపగలిగేది మార్క్సిజం మాత్రమేనని చెప్పారు. మార్క్స్ జయంతి సందర్భంగా ఎడ్యుకేషన్ సబ్ కమిటీ ఆధ్వర్యాన ఖమ్మం సీపీఐ కార్యాలయంలో 'మార్క్సిజం – సమాజంపై ప్రభావం' అంశంపై శుక్రవారం ఏర్పాటుచేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. మార్క్సిజం మాత్రమే అసమానతలు లేని సమాజాన్ని సృష్టించగలుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో అవినీతి, కులం, దోపిడీశక్తుల ప్రభావం పెరిగినప్పటికీ ఈ దోపిడీ సమాజం పతనం కాక తప్పదన్నారు. ఈసదస్సుకు శింగు నర్సింహారావు అధ్యక్షత వహించగా జమ్ముల జితేందర్ రెడ్డి, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్.సీతామహాలక్ష్మి, తోట రామాంజనేయులు పాల్గొన్నారు.

పాలేరు నుంచి పోటీ చేయండి..

నేలకొండపల్లి: వచ్చే ఎన్నికల్లో పాలేరు నుంచి పోటీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను పలువురు యువకులు కోరారు. ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లిలోని తమ్మినేని నివాసంలో శుక్రవారం గువ్వలగూడెంకు యువకులు ఆయనను కలిసి సీపీఎంలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టులు చట్టసభల్లో లేకపోవటంతో ప్రజల సమస్యలపై ప్రస్తావన రావడం లేదని తెలిపారు. ఈమేరకు వచ్చే ఎన్నికల్లో ఎన్నికల్లో పాలేరు నుంచి పోటీచేయాలని ఆయనను కోరారు. నాయకులు మారుతి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సీబీఐ కోర్టులో లొంగిపోయిన గంగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ-1 నిందితుడు ఎర్ర గంగిరెడ్డి శుక్రవారం హైదరాబాద్ నాంపల్లి సీబీఐ కోర్టులో లొంగిపోయారు. గంగిరెడ్డి బెయిల్ రద్దుచేస్తూ తెలంగాణ హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసిందే. జూన్ 30 వరకు జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. ఆ తర్వాత రూ.లక్షన్నర పూచీకత్తుతో ట్రయల్ కోర్టు నుంచి బెయిల్ పొందవచ్చని గంగిరెడ్డికి సూచించింది. వివేకా హత్యకేసులో గంగిరెడ్డిని 2019 మార్చి 28న అరెస్ట్ చేశారు. 90 రోజులు గడిచినా ఆయనపై సిట్ చార్జిషీట్ దాఖలు చేయకపోవడంతో ఆయనకు కడప కోర్టులో డీఫాల్ట్ బెయిల్ వచ్చింది. అప్పటి నుంచి బయటే ఉన్న ఆయన హైకోర్టు ఆదేశాల మేరకు లొంగిపోయారు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయన్ని జైలుకు తరలించారు.

వైఎస్సార్‌సీపీలోకి బొమ్మిరెడ్డి

సాక్షి, అమరావతి : పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్, టీడీపీ నేత బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. తాడేపల్లిలో క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. బొమ్మిరెడ్డితో పాటు ఆత్మకూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, టీడీపీ నేత ఇందూరు వెంకటరమణారెడ్డిలు కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, వరప్రసాద్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. టీడీపీలో డబ్బులున్న వారికే పదవులు దక్కుతాయని బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి చెప్పారు. సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన అనంతరం ఆయన తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడారు.

నేడు ఏపీ టెన్త్ ఫలితాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు శనివారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఈ ఫలితాలను విజయవాడలో విడుదల చేయనున్నారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షలకు 6.40 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వీరిలో 6,05,052 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో బాలికలు 2,95,807 మంది..బాలురు 3,09,245 మంది ఉన్నారు. ఫలితాలను https://www.sakshieducation.comలో చూడవచ్చు.

నర్రెడ్డి సోదరులు చెప్పినట్టే చేశా

ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో వివేకా పీఏ కృష్ణారెడ్డి సంచలన వ్యాఖ్యలు

- ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో వివేకా పీఏ కృష్ణారెడ్డి సంచలన వ్యాఖ్యలు
- లెటర్, ఫోన్ దాచిపెట్టమని రాజశేఖరరెడ్డి చెప్పారు
- ఆ విషయాలన్నీ ఎవరికీ చెప్పొద్దన్నారు
- నుదుటిపై దెబ్బ, బెడ్ రూమ్.. బాత్‌రూంలో రక్తం ఉందని కూడా చెప్పాను
- వాళ్లవన్నీ ఏమీ పట్టించుకోలేదు.. మేం చూసుకుంటామన్నారు
- ఎర్రగంగిరెడ్డి ఇంట్లోకి వచ్చిన వెంటనే రక్తం వాంతులని చెప్పాడు
- ఈయన సూచన మేరకే పనిమనిషి లక్ష్మి, రాజశేఖర్, ట్యాంకర్ బాషాలు శుభ్రం చేశారు
- నా ఫోన్‌లో సీఐ శంకరయ్యతో నర్రెడ్డి రాజశేఖరరెడ్డి మాట్లాడారు
- తాము చెప్పినట్లు వినకపోతే జైలుకెళ్తావని సునీతమ్మ అన్నారు



సాక్షి ప్రతినిధి, కడప : మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి మృతి చెందాక ఆయన అల్లుడు.. బావమరిది నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, అతని సోదరుడు నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డిలు చెప్పినట్టే చేశానని వివేకా పీఏ కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. పెద్దోళ్లు కనుక వారు చెప్పినట్టే చేయాల్సి వచ్చిందన్నారు. 'వారు చెప్పినట్లు చేయకపోతే నువ్వు కూడా జైలుకు వెళ్తావు' అని వివేకా కుమార్తె సునీతమ్మ కూడా చెప్పడంతో వారి సూచనల మేరకు నడుచుకున్నానని ఇటీవల ఆయన ఓ టీవీ చానల్ (ఎన్‌టీవీ)కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పూసగుచ్చినట్లు వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

రోజులాగే ఆ రోజూ వెళ్లాను

నేను 30 ఏళ్లకు పైగా వివేకా సార్ వద్ద పని చేస్తున్నాను. ప్రతిరోజు 5.30 గంటలకు సార్ ఇంటికి వెళ్లే అలవాటు. ఆ రోజూ కూడా అలాగే వెళ్లాను. ఆయన నిద్ర లేచి ఉంటే హాలులో లైట్ వేస్తారు. వాచ్‌మన్ రంగన్న పడుకొని ఉన్నాడు. సార్ ఇంకా లేవలేదని బయటికి వచ్చి, వీధిదీపం కింద ఐదు నిమిషాలు ఆంధ్రజ్యోతి పేపర్ తిరగేశాను. వివేకా సతీమణి సౌభాగ్యమ్మకు ఫోన్ చేశాను. 'సార్ లేట్‌గా వచ్చి ఉంటాడులే.. కొద్దిసేపు పడుకోని' అని ఆమె సూచించారు. తిరిగి పేపర్ చదువుతుండగా.. వంట మనిషి లక్ష్మి, ఆమె కుమారుడు వచ్చారు. సార్ ఇంకా లేవలేదా? అని అడిగారు. 'రాత్రి లేట్‌గా వచ్చి ఉంటారు.. లేప వద్దని మేడమ్ చెప్పింది' అని చెప్పాను. కొద్దిసేపటి తర్వాత.. సార్ లేవకపోతే లేపాలి కదా.. మళ్లీ ఎందుకు లేపలేదు.. అని అరుస్తారని వంటమనిషి లక్ష్మిని బెడ్‌రూమ్ సైడుకు వెళ్లి పిలవాలని చెప్పాను. లక్ష్మి బెడ్‌రూము వద్దకు వెళ్లి పిలిచి వచ్చే సమయంలో వాచ్‌మన్ రంగన్న లేచి.. బెడ్‌షీట్‌ను సందులో పెట్టి ఉత్తరం వైపు ఉండే గార్డెన్ వైపు వెళ్లిపోయాడు. అంతలోనే వాచ్‌మెన్ రంగన్న పరుగెత్తుకుంటూ వచ్చి సార్ పడిపోయాడని చెప్పాడు. నేను వంటమనిషి కుమారుడు ప్రకాశ్ నార్త్ సైడ్ వాకిలి గుండా లోపలికి పరుగెత్తాము.

లోపలికి వెళ్లి చూస్తే అంతా రక్తమే

ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బెడ్‌రూం అంతా రక్తం. భయం వేసింది. ఏసీ, లైట్ ఆన్‌లో ఉంది. సార్ మాత్రం బెడ్‌పై లేడు. బాత్‌రూములో పడిపోయి ఉన్నాడు. నాడి పట్టుకుని చూశా. తలపై గాయం కనిపిస్తోంది. నాతోపాటు ఉన్న ప్రకాశ్‌తో మన సార్ మనకు లేడని చెప్పా. బయటికి వచ్చి వివేకా సార్ అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్ చేశాను. 'బావ ఇక మనకు లేడు. ఎవరో ఏదో చేశారు. ఏదో జరిగింది. తలపై గాయం కనిపిస్తోంది. ఇల్లంతా రక్తం ఉంది' అని చెప్పాను. తర్వాత ఆయన సోదరుడు శివప్రకాశ్‌రెడ్డికి కూడా అదే చెప్పాను. తర్వాత కొద్దిసేపటికి వైఎస్ వివేకా మొబైల్ సోఫాలో కనిపించింది. సైలెంట్‌లో ఉంది. ఏదో ఫోన్ రావడంతో రింగ్ అవుతున్నట్లు గుర్తించి, జేబులో పెట్టుకున్నాను. బెడ్ ముందు ఉన్న వీల్ చైర్ ముందు ఓ పేపరు పడి ఉంది. ప్రకాశ్, నేను దాన్ని ఓపెన్ చేసి చూశాము. అందులో సార్ రాసిన మ్యాటర్ ఉంది. ఆ లెటర్‌లో అక్షరాలు అంత క్లియర్‌గా లేవు. బాగా పరిశీలిస్తే 'డ్రైవర్ ప్రసాద్ నిన్న డ్యూటీకి త్వరగా రమ్మన్నందుకు నన్ను కొట్టి చంపాడు. మీరు డ్రైవర్ ప్రసాద్‌ను వదిలి పెట్టవద్దు' అని రెండుసార్లు రాసి ఉంది. కింద వైఎస్ వివేకా అని ఉంది.

లెటర్‌ను ఎవరికీ చూపించొద్దన్నారు

ఆ లెటర్ విషయం వెంటనే అల్లుడు రాజశేఖరరెడ్డికి తెలియజేశాను. 'ఆ లెటర్‌ను జాగ్రత్తగా దాచి పెట్టు.. ఎవరికీ చూపించవద్దు' అన్నాడు. నేను పోలీసులతో ప్రాబ్లమ్ అవుతుంది కదా అని అడిగాను. 'అదంతా నేను వచ్చిన తర్వాత మాట్లాడతా. నీకు వచ్చిన ఇబ్బందేమీ లేదు. నేను వచ్చాక పోలీసులకు ఇస్తాను. అప్పటి దాకా దాచి పెట్టు' అని చెప్పాడు. ఈ విషయంగా శివప్రకాశ్‌రెడ్డికి కూడా తెలియజేసి.. నాకు దిక్కుతోచడం లేదని చెప్పాను. తర్వాత కొద్దిసేపటికి ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి వచ్చాడు. నేనే ఆయన్ను లోపలికి పిలుచుకుని వెళ్లాను. అవినాశ్‌రెడ్డితోపాటు శివశంకర్‌రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి మరి కొంత మంది ఉన్నారు. తర్వాత అవినాశ్‌రెడ్డి సార్ బయటికి వచ్చి లాన్‌లో ఫోన్‌లో మాట్లాడుతున్నారు. ఆ తర్వాత వైఎస్ అవినాశ్‌రెడ్డి చిన్నాన్న, పెద్దనాన్న, కుటుంబ సభ్యులు ఒకరి తర్వాత ఒకరు అక్కడికి వచ్చారు. నేను రంగన్నను పిలిచి దబాయిస్తే, రాత్రి దోశలు తిని నిద్రయానని చెప్పాడు.

పోలీసులకు చెప్పేద్దామంటే వినలేదు

గుండెపోటు విషయం ఎవరు ఎలా చెప్పారో తెలియదు. లెటర్, రక్తాన్ని బట్టి వైఎస్ వివేకాను ఎవరో ఏదో చేశారని నేను భావించాను. కొద్దిసేపటికి సీఐ శంకరయ్య, ఎర్రగంగిరెడ్డి వచ్చారు. ఎర్ర గంగిరెడ్డి రావడంతోటే బ్లడ్ వామ్‌టింగ్ చేసుకున్నాడని చెప్పాడు. బాత్‌రూములో గోడకు ఆరు, ఏడు అడుగులు రక్తం చిమ్మిందని చెప్పగా.. బేసిన్‌కు తల కొట్టుకుని రక్తం వచ్చి ఉంటుందిలే అన్నాడు. ఈ విషయంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తామా అంటే ఏం అవసరం లేదులే అన్నాడు. ఎర్రగంగిరెడ్డి ఇలా చెబుతున్నాడని నేను నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఫోన్ చేసి చెప్పాను. పక్కన సీఐ ఉన్నాడని మాట్లాడాలని ఫోన్ సీఐకి ఇచ్చాను. వాళ్లిద్దరు మాట్లాడుకున్నారు. రాజశేఖరరెడ్డి స్టేషన్‌లో కంప్లైంట్ రాసివ్వాలని సూచించారు. కొద్దిసేపటికి ఎర్రగంగిరెడ్డి.. కంప్యూటర్ ఆపరేటర్ ఇనాయతుల్లాకు 'లక్ష్మమ్మను రమ్మను.. బక్కెట్‌తో నీళ్లు తీసుకుని ఇదంతా క్లీన్ చేయాలి' అని చెప్పాడు. లక్ష్మమ్మ సగం క్లీన్ చేసి.. కళ్లు తిరుగుతున్నాయని చెప్పి వెళ్లిపోయింది. తర్వాత తన వద్ద పనిచేసే పిల్లలు రాజశేఖర్, ట్యాంకర్ బాషాతో ఇనాయతుల్లా క్లీన్ చేయించారు. సార్ డెడ్‌బాడీ బాత్‌రూము నుంచి తేవడానికి ఎర్రగంగిరెడ్డితో కలిసి నలుగురు వెళ్లారు. తర్వాత అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లారు.

పోలీసులు బాగా కొట్టారు

అవినాశ్‌రెడ్డి ఉదయాన్నే వచ్చి వెళ్లాడు.. మళ్లీ రాలేదు. రక్తం శుభ్రం చేసే సమయంలో ఆయన లేరు. నేను సీఐ చెప్పినట్లు కంప్లైంట్ రాసిచ్చి ఆస్పత్రికి వెళ్లాను. అక్కడి నుంచి ఇంటికి వెళ్లి.. నా భార్యను తీసుకొచ్చి పోస్టుమార్టం రూమ్ వద్ద సార్‌ను చూపించాను. తర్వాత సార్ డెడ్ బాడీని ఇంటి వద్దకు తెచ్చారు. అప్పుడు లెటర్‌ను నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి ఇచ్చాను. తర్వాత 15 నిమిషాలకు ఆ లెటర్‌ను ఎస్పీకి అందజేశానని, నీకు ఇబ్బంది లేదని రాజశేఖరరెడ్డి చెప్పాడు. సాయంత్రం 4 - 4.30 గంటల ప్రాంతంలో నన్ను పోలీసులు తీసుకువెళ్లి జీఎన్‌టీయూ గెస్ట్‌హౌస్‌లో పెట్టారు. అక్కడి నుంచి నాతోపాటు మరికొందరిని వేముల పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం కడప డీటీసీకి తీసుకెళ్లి 13 రోజులు పెట్టుకుని అందరినీ కొట్టారు. తర్వాత నాతోపాటు ప్రకాశ్, ఎర్రగంగిరెడ్డిని ముద్దాయిలుగా చూపిస్తూ రిమాండ్‌కు తరలించారు. మూడు నెలలు జైలులోనే ఉన్నాం. మధ్యమధ్యలో సునీతమ్మ, రాజశేఖరరెడ్డి వచ్చి మాట్లాడిపోయే వారు. మేము బయటికి వచ్చిన కొద్దిరోజుల తర్వాత కేసు సీబీకి బదిలీ చేశారు. తర్వాత సునీత, రాజశేఖరరెడ్డి.. సీబీఐకి సహకరించాలని చెప్పేవారు. అప్పటి నుంచి సీబీఐ అధికారులు ఎప్పుడు పిలిచినా వెళ్లి వచ్చాం.

సీబీఐ వాళ్లూ కొడతారనుకోలేదు

సీబీఐ వాళ్లు ఢిల్లీకి రావాలని చెప్పారని నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి తెలియజేశాను. వెళ్లమని చెప్పి.. టికెట్ ఆయనే తీసిచ్చాడు. వారికి సహకరించాలని సూచించాడు. ఢిల్లీలో వాళ్లు నెల రోజులు పెట్టుకున్నారు. మధ్యలో రాంసింగ్ వచ్చి 'నేను చెప్పినట్లు చెబుతావా? లేదా? వైఎస్ అవినాశ్‌రెడ్డి, శంకర్‌రెడ్డిలు మిమ్మల్ని మ్యానేజ్ చేశారు. ఆ విషయం మీరు చెప్పడం లేదు. మేము చెప్పినట్లు చెప్పకపోతే జైలుకు పంపుతాం' అని బెదిరిస్తూ కొట్టేవారు. సీబీఐ అధికారులు ఇలా కొడతారని ఊహించలేదు. నెల తర్వాత నన్ను పంపించేశారు. ఆ తర్వాత నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, సునీతలు నన్ను హైదరాబాదుకు రమ్మని పిలిచారు. అక్కడికి వెళ్లాక 'నువ్వు రామ్‌సింగ్ సార్ ఎలా చెబితే అలా చేయాలి. లేకపోతే ఇబ్బందుల్లో పడతావు. నువ్వు సహకరిస్తే నిన్ను సేవ్ చేస్తాం. ఇదొక్కటే మార్గం' అని చెప్పారు. మధ్యమధ్యలో నర్రెడ్డి రాజశేఖరరెడ్డి.. అవినాశ్ మ్యానేజ్ చేశాడని చెప్పమన్నారు.

అలాగైతే జైలుకెళ్లేది నువ్వేనని భర్తకు సునీత హెచ్చరిక

అవినాశ్ నన్ను మేనేజ్ చేయడం ఏమిటని అప్పుడే గట్టిగా వ్యతిరేకించాను. అప్పుడు సునీత నాపై ఫైర్ అవుతూ 'నువ్వు ఏమనుకుంటున్నావు.. నిన్ను ఎవ్వరూ కాపాడలేరు' అని హెచ్చరించారు. రాజశేఖరరెడ్డి నన్ను సముదాయించేలా భుజం తట్టాడు. నేను ఉన్నది ఉన్నట్లు చెబుతానని తెలియజేశాను. ఆ సమయంలో సునీత.. రాజశేఖరరెడ్డిని ఉద్దేశించి 'కృష్ణారెడ్డి సహకరించకపోతే నువ్వే జైలుకు వెళతావు' అని చెప్పింది. ఆమె అలా ఎందుకు అనిందో నాకు అర్థం కాలేదు. తర్వాత కొద్ది రోజులకు రాత్రి సమయంలో సీబీఐ అధికారి రాంసింగ్ నా సెల్‌కు మిస్డ్ కాల్ ఇచ్చారు. తర్వాత మా అబ్బాయితో ఫోన్ చేయించి (రామ్‌సింగ్‌కు తెలుగు సరిగా రాదు కనుక) మాట్లాడించాను.

నిజం చెబితే కొడతారేంటి?

'దస్తగిరి, రంగన్నలు మేము చెప్పినట్లు విన్నారు. నువ్వు కూడా చెప్పినట్లు వింటే సేవ్ చేస్తా' అని రామ్‌సింగ్ తెలిపారు. తెల్లవారగానే నీ ఇద్దరు కుమారులతో కలిసి కడపలోని కేంద్ర కారాగార గెస్ట్‌హౌస్‌కు రావాలని సూచించారు. నేను ఈ విషయం నర్రెడ్డి రాజశేఖరరెడ్డికి చెప్పగా, వెళ్లాలని సూచించాడు. హైదరాబాదులోని పిల్లలను పిలిపించి ఉదయం 11 గంటలకు వారితో కలిసి వెళ్లాను. మేము చెప్పినట్లుగా సహకరించాలని కోరారు. ఇందుకు నేను మరోమారు అభ్యంతరం చెబుతూ.. నాకు తెలిసిన విషయాలన్నీ చెబుతానని చెప్పాను. దాంతో ఆయన కట్టె తీసుకుని నన్ను కొట్టాడు. నిజం చెబితే కొడతారా? అంటూ మా పిల్లలు అడ్డుతగిలారు. సాయంత్రం వరకు నన్ను అక్కడే పెట్టుకుని బూతులు తిట్టి పంపారు. మళ్లీ పిలిచినప్పుడు కూడా ఇలాగే మాట్లాడితే నీ కథ ఉంటాదని హెచ్చరించారు.

చెప్పినట్లు వినలేదని పెళ్లి ఆపించేశారు

అప్పటికి వారం రోజుల్లో నా చిన్న కుమారుడి పెళ్లి. సీబీఐ వాళ్లకు నేను సహకరించలేదని నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, సునీతకు కోపం వచ్చింది. వారు పెళ్లి కుమార్తె వారికి ఫోన్ చేసి 'కృష్ణారెడ్డి హత్య కేసులో ఉన్నాడు. వైఎస్ అవినాశ్‌రెడ్డికి సహకరించాడు. త్వరలో ఆస్తులు స్వాధీనం చేసుకుంటారు. ఈ పెళ్లి క్యాన్సిల్ చేసుకోండి' అని ఫోన్ చేసి చెప్పారు. నాకు విషయం తెలిసి నేను నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డి వద్దకు వెళ్లగా సరైన స్పందన లేదు. పెళ్లి క్యాన్సిల్ అయితే కానీ అని నేను నిజాన్ని నిర్భయంగా చెప్పాలని భావించాను. ఆ తర్వాత నా కుమారుడు అమెరికా వెళ్లాడు. నేను ప్రాణ రక్షణ కల్పించాలని ఎస్పీకి వినతిపత్రం ఇవ్వబోతే ఆయన తీసుకోలేదు. అందుకే పులివెందుల కోర్టులో ప్రైవేటు కంప్లెయింట్ వేశాను. దాని గురించి ఇప్పటివరకు అతీగతీ లేదు. నా పాస్‌పోర్టు రెన్యువల్ కాకుండా ఆగిపోయింది. నా ప్రమోషన్, నా కుమారుడి పెళ్లి ఆగిపోయాయి. నేను వివేకాకు సేవ చేసినందుకు ఇస్తామన్న ఐదు ఎకరాల భూమి ఇవ్వలేదు. ఇలా అన్ని విధాలా నాకు అన్యాయం జరిగింది. ఇప్పుడు సీబీఐ కొత్త బృందం వచ్చింది. వారికి నాకు తెలిసిన విషయాలన్నీ చెప్పాను. వివేకాకు హైదరాబాద్, పులివెందుల, కడపల 200 ఎకరాలకు పైగా భూమి ఉంది. ఆ ఆస్తులన్నీ దాదాపు కంపెనీ పేరుపైనే ఉండేవి.

జిల్లా వార్తలు

'రైసెట్'లో ఉపాధి కోర్సుల్లో శిక్షణ

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్డులోని తరుణీ హాట్‌లో ఉన్న రైసెట్ కేంద్రంలో నిరుద్యోగ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ విశాల్ దేవ్ తెలిపారు. జ్యూట్ బ్యాగుల తయారీ, సీసీ కెమెరాల నిర్వహణ అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్హత, 18నుండి 45 ఏళ్ల వయస్సు కలిగిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, నాలుగు ఫొటోలు, బ్యాంక్ పాస్‌పుస్తకంతో తమ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. అభ్యర్థులకు ఈనెల 10 నుండి 23 వరకు ఉచిత వసతి, భోజనం సౌకర్యం కల్పించి శిక్షణ ఇస్తామని ఆయన వెల్లడించారు.

పట్టాల పంపిణీపై అభ్యంతరాలు ఉంటే తెలపండి

కల్లూరు: కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధి ఏన్కూరు మండలం నాచారం, తూతులింగన్నపేట షెడ్యూల్ ఏరియాలోని భూమి సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆర్‌డీఓ సీహెచ్ సూర్యనారాయణ తెలిపారు. ఇక్కడి 119, 117 సర్వే నంబర్లలోని భూమికి ఖాజామొహినుద్దీన్ సిద్ధిఖీ, ఖాజా అబ్దుల్ సిద్దిఖీ, 53/2, 53/3 సర్వే నంబర్‌లోని భూమికి కొలిపాక సుదేష్ణభాయి, కంకిపాటి లక్ష్మీనర్సింహారావు పట్టాదారులుగా ఉన్నా దశాబ్దాలుగా వారెవరో తెలియడం లేదని పేర్కొన్నారు. ఈ భూమిలో పన్నెండేళ్లుగా గిరిజనులు సాగు చేస్తుండడంతో వారికి పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ విషయమై అభ్యంతరాలు ఉంటే పదిహేను రోజుల్లోగా ఏన్కూరు తహసీల్‌లో లిఖిత పూర్వకంగా తెలపాలని, ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే గిరిజనులకు పట్టాలు జారీ చేస్తామని ఆర్డీఓ శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు.

ఈ నెల 19న వేతన సవరణ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు గనుల్లోని కార్మికుల వేతన సవరణకు సంబంధించి 11వ వేజ్ బోర్డు పదో సమావేశం ఈ నెల 19న జరగనుంది. ఈ సమావేశాన్ని కోల్‌కతాలో నిర్వహిస్తున్నట్లు కోలిండియా యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎనిమిది రాష్ట్రాల్లోని బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న సుమారు 3.2 లక్షల మంది కార్మికుల జీతభత్యాలు, అలవెన్సులు, సౌకర్యాలపై చర్చించనున్నారు. సమావేశంలో కోలిండియా చైర్మన్ ప్రమోద్ అగర్వాల్, ఇతర విభాగాల డైరెక్టర్లతో పాటు సింగరేణి డైరెక్టర్లు, జీఎంలు, జాతీయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారు.

పెంపు సరే.. ఇవ్వడం ఎలా?

- జీపీ కార్మికుల వేతనాల పెంపు భారం పంచాయతీలపైనే..
- ఇప్పటికే బిల్లుల పెండింగ్‌తో ఆర్థిక ఇబ్బందులు
- పెంచిన వేతనం ప్రభుత్వమే చెల్లించాలంటున్న పాలకవర్గాలు

ఇల్లెందురూరల్: కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామపంచాయతీల్లోని పారిశుద్ధ్య కార్మికుల వేతనాన్ని ప్రభుత్వం పెంచింది. వీరి వేతనాన్ని నెలకు రూ.వెయ్యి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం కార్మికుల్లో ఆనందం నింపినా గ్రామ పంచాయతీలపై మాత్రం భారం మోపినట్లేనని పాలకవర్గాల బాధ్యులు చెబుతున్నారు. ఇప్పటికే పెండింగ్ బిల్లులు, నిలిచిన రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులతో సతమతమవుతున్న తాము కేంద్ర నిధులతో ఎలాగోలా పాలన సాగిస్తున్నామని తెలిపారు. ఇంతలోనే ప్రభుత్వం తమపై మళ్లీ భారం మోపిందని పేర్కొంటున్నారు.

అప్పుల భారంతో సర్పంచ్‌లు

గ్రామపంచాయతీలకు గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతినెలా గ్రాంట్లను మంజూరు మంజూరు చేసేవి. ఏడాదికాలంగా అటు కేంద్రం లేదంటే ఇటు రాష్ట్రం నిధుల విడుదలలో జాప్యం చేస్తుండడంతో గ్రామపంచాయతీల్లో ఆర్థిక ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ప్రాథమిక అవసరాలైన ట్రాక్టర్ డీజిల్, పారిశుద్ధ్య పనులు, నిర్వహణ ఖర్చులను సర్పంచ్, కార్యదర్శులు తమ జేబుల్లో నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలా పెట్టుబడి కోసం అప్పులు చేసిన సర్పంచ్‌లు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. ఒక్కో సర్పంచ్ ఎటులేదన్నా రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు గ్రామపంచాయతీల నిర్వహణకే పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. ఇవేకాక పూర్తయిన అభివృద్ధి పనుల బిల్లులు కూడా రాక అవస్థ పడుతున్నారు.

ఇలా మంజూరు.. అలా చెల్లింపులు

గ్రామపంచాయతీలకు ప్రస్తుతం కేంద్రప్రభుత్వం ద్వారా మాత్రమే ప్రతినెలా నిధులు మంజూరవుతున్నాయి. ఈ నిధులను సిబ్బంది వేతనాలు, ట్రాక్టర్ ఈఎంఐ, విద్యుత్తు బిల్లులు, కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలకే వెచ్చించాలని నిబంధన విధించారు. దీంతో ఆయా బిల్లులు సమర్పిస్తేనే ఆమోదం పొందుతుండగా.. నిధులు రాగానే చెల్లిస్తుండడంతో మళ్లీ ఖజానా ఖాళీ అవుతోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రావాల్సిన నిధుల్లో జాప్యంతో గ్రామ పంచాయతీల పాలకవర్గాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఇంతలోనే మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల వేతనాన్ని పెంచింది. ఈ నిర్ణయం స్వాగతించాల్సిందే అయినా గ్రామపంచాయతీలపై మాత్రం ఆర్థిక భారమేనని చెబుతున్నారు.



ఇల్లెందు మండలంలోని కొమరారం గ్రామం వ్యూ

ఖమ్మం జిల్లాలోని 20 మండలాల్లో 589 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటన్నింటిల్లో 2,294మంది కార్మికులు(మల్టీ పర్పస్ వర్కర్లు) విధులు నిర్వర్తిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలోని 481 గ్రామపంచాయతీల పరిధిలో 1,557 మంది పనిచేస్తున్నారు. మేజర్ పంచాయతీల్లో 10నుంచి 12మంది, చిన్న పంచాయతీల్లోనైతే నలుగురి నుంచి ఆరుగురు విధులు నిర్వర్తిస్తున్నారు. చిన్న పంచాయతీల్లో ఒక్కో కార్మికుడికి నెలకు రూ.8,500, మేజర్ పంచాయతీల్లోనైతే రూ.10,500 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,851మంది కార్మికులు పనిచేస్తుండగా రూ.వెయ్యి చొప్పున వేతనాన్ని పెంచడంతో పంచాయతీలపై రూ.38.51లక్షల మేర అదనం భారం పడనుంది.

పెంచిన వేతనం ప్రభుత్వమే చెల్లించాలి



గ్రామపంచాయతీ కార్మికులకు వేతనం పెంచడం హర్షణీయం. కానీ పంచాయతీల్లో ఆర్థిక వనరులు అంతంత మాత్రంగా ఉండడం, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు చెల్లింపులకే సరిపోతున్నాయి. ఈనేపథ్యాన పెంచిన వేతనాలు చెల్లింపు సాధ్యం కాదు. అందుకే కార్మికుల వేతనాన్ని ప్రభుత్వమే నేరుగా చెల్లించాలి.

– మోకాళ్ల కృష్ణ, సర్పంచ్, మాణిక్యారం, ఇల్లెందు మండలం

అదనపు భారం సరికాదు



రాష్ట్రప్రభుత్వం నుంచి నిధుల మంజూరు కాక.. కేంద్రప్రభుత్వ నిధులు బకాయిలు, వేతనాలకే సరిపోతుండడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాం. మళ్లీ పెంచిన వేతనాల చెల్లింపు భారం జీపీలపై మోపడం సరికాదు. ప్రభుత్వమే ప్రత్యేక గ్రాంట్ రూపంలో కార్మికులకు చెల్లించాలి.

– కుంజ కృష్ణ, సర్పంచ్, మామిడిగుండాల, ఇల్లెందు మండలం

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో కేటీపీఎస్ సత్తా

పాల్వంచరూరల్: పాల్వంచలోని కేటీపీఎస్ ఉద్యోగులు క్రీడా పోటీల్లోనూ రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ చూపాలని కేటీపీఎస్ ఏడో దశ చీఫ్ ఇంజనీర్ పి.వెంకటేశ్వరరావు సూచించారు. ఇటీవల భూపాలపల్లిలో టీఎస్‌జెన్‌కో ఆధ్వర్యాన నిర్వహించిన ఇంటర్ ప్రాజెక్టు క్రికెట్ పోటీల్లో కేటీపీఎస్ ప్రతిభ చూపి ద్వితీయస్థానం కైవసం చేసుకుందని తెలిపారు. శుక్రవారం సీఈ జట్టు కెప్టెన్ ఎండీ ఆరీఫ్, క్రీడాకారులు, మేనేజర్ సతీశ్‌కుమార్, కోచ్ కోటేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఈ యుగపతి, క్రీడా కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, డీఈ శేఖర్, ఏడీఈ వేణుగోపాల్ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ వెంకటేశ్వరరావు

జేపీఎస్‌లది న్యాయమైన పోరాటం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

చుంచుపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులది న్యాయమైన పోరాటమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట జేపీఎస్‌లు చేస్తున్న సమ్మె శుక్రవారం ఎనిమిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. జేపీఎస్‌ల సర్వీస్‌ను ఇకనైనా ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రభుత్వ అధికారులకు ఎక్కువ జీతాలు ఇస్తూ దుబారా ఖర్చులు చేస్తున్నారని ఆరోపించారు. జేపీఎస్‌ల సమస్యలపై ఇప్పటికే సీఎం కేసీఆర్‌కు లేఖ రాశానని, త్వరలోనే స్వయంగా కలిసి చర్చిస్తానని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారమయ్యే వరకు జేపీఎస్‌లు ఉద్యమం కొనసాగించాలని, వారికి ఎర్రజెండా అండగా ఉంటుందని తెలిపారు. పార్టీ రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్యతో పాటు అన్నవరపు సత్యనారాయణ, వీరన్న, లిక్కి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే దీక్ష చేస్తాం: కూనంనేని

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పేస్కేల్ ప్రకటించాలని, ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే వారి తరఫున నిరవధిక దీక్ష చేపట్టేందుకైనా వెనుకాడేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. జేపీఎస్‌ల దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ సమస్యపై ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమం కొనసాగించాలని పిలుపునిచ్చారు. నాలుగేళ్ల ప్రొబేషనరీ పీరియడ్ ముగిసినా కార్యదర్శులను రెగ్యులర్ చేయకపోవడం సరికాదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, నాయకులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్ పాల్గొన్నారు.




సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న తమ్మినేని



సంఘీభావం తెలుపుతున్న సాంబశివరావు

ఫార్మసిస్టులకు అవగాహన సదస్సు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ జిల్లాలోని ఫార్మసిస్టులకు జిల్లా కేంద్రంలోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని మందుల దుకాణాల్లో తప్పనిసరిగా ఫార్మసిస్టుల సమక్షంలోనే మందులు విక్రయించాలని సూచించారు. నిషేధిత, మత్తు మందులను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయించొద్దని, కొనుగోలుదారులకు తప్పక బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు. తొలుత జిల్లాలో పలు షాపుల్లో ఖమ్మం ఏడీ ప్రసాద్ ఆధ్వర్యాన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మి తనిఖీలు చేపట్టారు.



మాట్లాడుతున్న డ్రగ్ కంట్రోల్ ఏడీ ప్రసాద్

బౌద్ధం మతం కాదు... మార్గం

నేలకొండపల్లి: దక్షిణ భారతదేశంలోకెల్లా పెద్దదైన నేలకొండపల్లిలోని బౌద్ధ క్షేత్రం వద్ద శుక్రవారం వైశాఖ బుద్ధ పౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బౌద్ధాచార్య నాగసేన బుద్ధుడి చరిత్రను వివరించారు. అనంతరం మహాసభ చైర్మన్ బసవయ్య మాట్లాడుతూ బౌద్ధం మతం కాదని.. ఇది మార్గమని తెలిపారు. బుద్ధుడి మార్గాన్ని అనుసరిస్తూ విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెద్దపాక వెంకట్, కె.సంపత్‌కుమార్, బీఎస్పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అల్లిక వెంకటేశ్వరరావు, పీసీ వీరస్వామితోపాటు శోభన్‌నాయక్, మట్టే గురుమూర్తి, పి.ఆంజనేయులు, సంజీవరావు, పగిడికత్తుల ఈదయ్య, బొడ్డు పటేల్, కట్టికోల వెంకటేశ్వర్లు, వంగూరి ఆనందరావు, పెద్దపాక విజయ్, జగదీశ్ పాల్గొన్నారు.



బౌద్ధక్షేత్రం వద్ద పూజలు చేస్తున్న బౌద్ధాచార్యులు, నాయకులు